

# ఒకే కోణంలో

రచన: "శివం"

సుబ్బారావు చెవిలో మరో రెండు క్షణాలపాటు అవే మాటలు మారుమ్రోగేయ్. "పెళ్ళయి రెండేళ్ళన్నా కాకుండానే పుట్టింటికి పంపించేడు. మళ్ళీ తిరిగి ఏణ్ణర్థ మయినా పిల్చుకురాడు. అదేం కాపురమో!"

అరుగులమీద తీరి కూర్చుని, యివీ ఆడవాళ్ళకబుర్లు. ఆ భర్త యిట్లా చేసేడు, యీ యిల్లాలు యిట్లా అన్నది—యిదీ లోకం. ఎంతసేపూ వాళ్లనూ, వీళ్ళనూ గురించి చెడును కెలకడమే లోక ధర్మం కాబోలును. వాడెవరో భార్యను పుట్టింటికి పంపించి తెచ్చుకోకపోతే వీళ్ళందరికీ కష్టమెందుకో?

"గుడ్ యీవెనింగ్ మిష్టర్ రావ్!"

తల ఎత్తేడు వోక్షణం తలక్రిందులయినట్లయి. తన ఆఫీసుకు ఎదురుగా వుండే బ్యాంక్ లోని ఎక్కౌంటెంటు భార్యతో జట్కాలో పోతున్నాడు, చిరునవ్వు వదుల్తూ—సినిమాకి కాబోలును! నవ్వుకుంటూ మరో రెండడుగులు ముందుకు వేసేసరికి గుర్తొచ్చింది అతనికి, యివ్వేళేకదూ తనుకూడా తన భార్యతో కలసి సినిమాకి వెడదామని అనుకుంట. క్రొత్తసినిమా 'జీనత్' యివ్వేళే ప్రారంభం—వెడితే బావుండును.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ సుబ్బారావ్ యింట్లో ప్రవేశించే సరికి గృహిణి జానకి అద్దం ఎదుట నుంచుని తల దువ్వుకుంటూాంది.

ఇంకేం! తయారుగానే వున్నదన్న మాట. కాని వంటా,అవీ చేసిందో లేదో?

సుబ్బారావ్ యీాల వేసుకుంటూ, కోటును స్టాండ్ కు తగిలించి, దొడ్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కొని వచ్చేసరికి, జానకి వకచేత్తో సవరాన్ని పుచ్చుకుని

మరో చేతిలోని దువ్వెన్నతో చిక్కు తీస్తూంది. సుబ్బారావువళ్లు మండిపోయింది. 'ఛీ' అనుకుంటూ చేతిలోనిటవల్ తో ముఖాన్ని తుడుచుకుంటూ హాల్లోని యీజీచైరులో చేర్లబడి అనుకున్నాడు "ఈఆడవాళ్లు అంత అసహ్యమయిన సవరాన్ని ఎందుకు ఉపయోగిస్తారో?" నిజానికి తనకి సవరమన్నా, సవరాన్ని వుపయోగించే ఆడవాళ్లన్నా తగని అసహ్యం. ఆ సవరాన్నిచూస్తే తనకి డోకు కూడా వస్తుంది. అయినా తనభార్య యీ విషయాన్ని యీ షణ్మాత్ర మయినా గుర్తించినట్లు అగుపించదు. గుర్తించే వుంటే, తనకి అసహ్యమని తెలిసినా ఆ పాడు పదార్థాన్ని ఇంకా ఎందుకు వుపయోగిస్తుంది?

సుబ్బారావు బుర్ర ఆలోచనలతో వేడెక్కిపోసాగింది. కుర్చీలో 'అనీజీ'గా అటూయిటూ కదులుతూ అనుకున్నాడు– 'ఛీ-ఏమిటీ పాడు ఆలోచన్లు. వీటితోటే పిచ్చెక్కిపోతుందేమోనాకు."

చిన్న నిట్టూర్పుతో పక్కనేవున్న పత్రికను తీసుకుని పేజీలు తిరగవేయ సాగేడతను.

జానకి హాలులోకి వచ్చింది - జార్జెట్ చీరతో పెరపెర చప్పుడు చేసుకుంటూ పుస్తకంమీద అట్లానే వోకన్నుంచి, వోరగా భార్యవైపు చూచేడు సుబ్బారావ్. బల్లమీద కాఫీ గ్లాసునుంచి తిరిగి వెడుతూంది వంటింట్లోకి జానకి-జార్జెట్ చీరఅయితే బాగానే వున్నదిగాని ఆతల దువ్వుకోవడమే-ఎప్పటిలా, మొగరాయుడిలా, పాపిటను వకవైపు పైకి దువ్వడమే మహాఘోరంగా వుంది. పాడు మృగం! అందంగా-నాజూగ్గా తల దువ్వుకోవడమన్నా తెలియదు!

కాపరానికి వచ్చినకొత్తలోనే నయం. పల్లెటూరి దానిలా, సామాన్యంగా వుండేది. అప్పుడే నయమేమో? అవును అప్పుడు తనకింత అసహ్యమూ, చిరాకూ వుండేవి కావు. ఒకప్పుడు కాకపోతే మరోప్పుడైనా తనకామెతో మాట్లాడాలనిపించేది. దగ్గరకు తీసుకోవాలనిపించేది. ఇప్పుడు ఆ యింట్లో వుండటమే నరకమయిపోతుంటే! ముఖం చూడటమే దుర్భరమయి పోతూంటే. ఛీ! పాడుకొంప!

సుబ్బారావ్ చేతిలోంచి విసురుగా వెళ్లి పత్రిక టేబిలుకింద దాగుంది. పత్రిక తాకిడికి టేబిలుమీద కాఫీగ్లాసు గడగడ వణికింది.

సుబ్బారావులేచి నుంచుని టేబిలుమీద వూగేగ్లాసును ఎత్తిపట్టుకుని, అందులోని కాఫీని విషంలా గొంతులో పోసుకుని, చరచరా బయటకు నడిచేడు.

• చల్లటిగాలి తిరిగింది బయట. నడకను తగ్గిస్తూ అనుకున్నాడు సుబ్బారావు "అమ్మయ్య! ఎంత హాయిగావుంది—ఆరుబయట!"

గమ్యస్థానం లేకుండా, అడుగులు పడుతున్నయి—ముందుకు. 'ఎక్కడికి?' అని ప్రశ్నించుకున్నాడు సుబ్బారావు. 'ఎక్కడికి?' గత సంవత్సరం నుంచీ ఇది నిత్యకృత్యాలలో వకటి. చిరాకెత్తి బయటకు పోవడం, గమ్యస్థాన మనేది లేకుండా విసుగెత్తే వరకూ తిరిగి, తిరిగి, అలసిపోయి యింటికిచేరడం, భోజనం చేసి నిద్రపోవడం! ఎన్నాళ్ళోయిట్లా?

పార్కు వద్ద మిత్రులు ఎవరన్నా అవుపిస్తారేమోనని చూచేడు సుబ్బారావు. ఏడుంబావు అవవస్తుంది కాబోలున్న తెలుగువార్త లొస్తున్నాయి-రేడియోలో నుంచి. చికాకుతో రోడ్డుమధ్య కొచ్చి నలువైపులా చూచేడు, ఏం చేద్దామాఅని. 'ఏంచేద్దాం?' చాలాపాత ప్రశ్న!

తనొక్కడూ సినిమాకు దేనికైనా పోతే? దగ్గరలోని హాలులో ఏం పిక్చరు ఆడుతున్నదో! అతనిదృష్టి రోడ్డుప్రక్క గోడల మీదకి పోయింది. రంగు రంగుల వస్త్రాలతో, విచిత్రమైన ఆకర్షణలో గోడలమీద నర్గీస్, కామినీ, మన్వర్ సుల్తానాలు, పోస్టరలోంచి తొంగి చూస్తున్నారు. ఒకొక్కరిలో, మరొకరిలో చూడలేని ఆకర్షణ—ప్రత్యేకత! అటువంటి స్త్రీలను చేపట్ట కలిగిన వాడు ఎంత అదృష్టవంతుడో ?

అడుగులు ముందుకు వేస్తూ ఆలోచిస్తున్నాడు సుబ్బారావు తారలను గురించి, వాళ్ళ జీవితాలను గురించి. కారులు, బుర్రు బుర్రు మంటూ దుమ్మును లేపుకుంటూ ముందుకు సాగిపోతున్నాయి. సుబ్బారావు పరధ్యానంగా యింకా అడుగులు వేస్తూనే వున్నాడు అట్లానే.

భుజంమీద వెనకనుంచి చెయ్యి పడేసరికి వులిక్కి పడ్డాడు సుబ్బారావు. ప్రక్కకు చూచాడు. హనుమంతరావ్ !

హనుమంతరావు అంటున్నాడు "ఏమిటోయ్ అంత పరధ్యానంగా నడుస్తున్నావ్, ఏమిటీ అట్లావున్నావేం? వొంట్లో బాగాలేదా ?"

"బాగుండకేం. బాగానేవుంది. ఎక్కడికీ హుషార్ గా బయలుదేరావ్?"

"వస్తావా? రా. పోదాం."

"ఎక్కడికీ" మర్యాదకు అడిగాడు కాని, ఎక్కడికయనా తను సిద్ధమే ప్రస్తుతం. తనకి కావలసినదల్లా కాలక్షేపం.

మిత్రుడు హనుమంతరావు నవ్వుతూ "రా! ఆట్టే ప్రశ్నలు వెయ్యక. మరేం భయంలేదు"అన్నాడు

ఇద్దరూ సిగరెట్లు వెలిగించుకుని నడుస్తున్నారు సందులోనికి. హనుమంతరావు జీవితాన్ని గురించి—ఆనందాన్ని గురించి చాలా గొప్పగా మాట్లాడుతున్నాడు వాడికి అంతఆనందం జీవితంలో ఎక్కడ ఎట్లా అవుపించిందో మరి?

హనుమంతరావు ప్రశాంతంగా వున్న ఒక చిన్న యింటి ముందు నిలిచి తలుపు తట్టేడు. తెరుచుకుంది తలుపు. ముందు హనుమంతరావు, వెనక సుబ్బారావు! లోపలికి నడుస్తున్న సుబ్బారావుకు తలుపు ప్రక్కనే వూచలా, నాజూగ్గా వున్న సుందరి అవుపించింది. తడబడే అడుగులు వేస్తూ, ఎవరీమె అనుకుంటూనే ముందుకు నడిచేడు. వెనకాలే తలుపు మూసుకుంది. యిద్దరూ ముందు గదిలోని చెరోకుర్చీలో కూలబడ్డారు.

ఆమె చిరునవ్వుతో లోపలకు ప్రవేశించి నమస్కరించింది యిద్దరికీ. లైటును హెచ్చించి హనుమంతరావు వైపు తిరిగి "మమ్మల్ని మరచి పోయినట్లున్నారు పూర్తిగా?" అన్నది చిరునవ్వుతోనే

'అబ్బే లేదు. ఏదోతీరక యిటు రావటంలేదు. పైగా నిత్యమూ నిన్ను చూడాలంటే నేనేం రాజకుమారుణ్ణా?"

కిలాకిలానవ్వి హనుమంతరావుభుజాలు

వూగిస్తూ అన్నదామె "నిజం చెప్పండి, మీరు యువరాజులు కదూ! అయినా యువరాజులను అడగవలసినది మిమ్మల్ని ఎన్నడైనా అడిగేనా? మరచిపోయే- ఆయన ఎవ్వరో చెప్పరేం? ఎంతస్వార్థం మీది"

"ఏదీ నన్ను చెప్పనిస్తేనా? నా స్నేహితుడు సుబ్బారావు. కలెక్టరాఫీసులో పని చేస్తూంటాడు. ఈమె నా స్నేహితురాలు-ఇందిరోయీ"

ఇద్దరూ వకరి నొకరు చూచుకొనినవ్వుకున్నారు. ఆమె మరొక కుర్చీని లాగుకుంటూకూర్చుని, సుబ్బారావుతో ఎంతో పరిచయంగా, పాత స్నేహితురాలులా సినిమాలను గురించి, యాక్టర్లను గురించి మాట్లాడేస్తూంది. వక్క అరగంటలో తనకి ఏకూరలు ఇష్టమో, ఏనటీమణులంటే అసహ్యమో, ఎవరెట్లా నటిస్తారో... మాట్లాడేసింది.

సుబ్బారావు విస్తుపోయేడు ఆమె నిష్కల్మషమైన సంభాషణా ధోరణికి. మాట్లాడుతూ, మధ్యమధ్య ఆమె కనుబొమల్ని ఎగురవేయడం, నవ్వునుఆపుకునేప్పుడు ఆమెచేసే విచిత్రమైన ధ్వని, ఆమె ప్రవర్తనఅతనిని అమితంగా ఆకర్షించేయి. ఎప్పుడూ ఆమెమాటల్ని వింటూ అక్కడే కూర్చుండి పోతేనేం! హనుమంతరావు నిజంగా అదృష్టవంతుడు యిటువంటి స్నేహితురాలు దొరికినందుకు.

హనుమంతరావు 'యికపోదాం' అంటూ లేచే సరికి పది అవవస్తూంది. సుబ్బారావు ఆమెను వదలలేనట్లు బాధ పడుతూ, లేచిన వాడల్లా ఆమె వైపుతిరిగి దీనంగా అన్నాడు "ఇవ్వాళ్లలా యిట్లాగే మాట్లాడుకుంటూకూర్చుండిపోతేఎంత బావుణ్ణు! ఎప్పుడైనా తోచకపోతే మీవద్దకు వస్తే, తరిమెయ్యరుకదూ?"

ఆమె ఆకస్మికంగా అతనిని పసివాడిలా కౌగలించుకొని, తలను ముద్దెట్టుకుని అన్నది "మీయిష్టం వచ్చినప్పుడు రండి; మీయిల్లిది." ఆనందంతో ఏడుద్దామనిపించింది సుబ్బారావుకు. యీమె ఎంత తేలిగ్గా తనను అర్థం చేసుకో గలిగింది! ఎంతదయ! ఈరాత్రి ఆమెను చూడకుండా వుండగలడా తను? బాధపడుతూ హనుమంతరావు వెనకాలే బయటకు వచ్చేశాడు.

"పాపం ఆమె..." హనుమంతరావు ఏదో చెప్పబోతున్నాడు. సుబ్బారావు, హనుమంతరావు చేతులను పుచ్చుకుని దీనంగా అన్నాడు "వద్దు. ఆమె చరిత్రంతా చెప్పి నాకలలు చెడగొట్టకు. నా వూహాసౌధాలను పడద్రోయకు. ఈకలలోనే నన్ను ఆనందించనీ. ఆమె వేశ్యనీ, డబ్బు కోరుతుందనీ - చెప్పబోతున్నావు కదూ! వద్దు...వద్దు...నన్నట్లా నమ్మించకు." సుబ్బారావు కుర్రాడిలా ఏడుస్తున్నాడు గోడనీడల్లో కలిసిపోయి.

హనుమంతరావు మరేమీ మాట్లాడకుండా సుబ్బారావును పిలిచి జట్కా ఎక్కించాడు.

* * *

తెల్లవారింది. మూగగా బల్లపైకి కాఫీ ఫలహారాలువచ్చేయి. స్నానంచేసి, పత్రిక చదువుకుంటూ కూర్చున్నాడు. కూని రాగాల్తో వంటయింట్లో భోజనం తయారవుతూంది. మరోగంటకే 'వంటయింది' అని సన్నని స్వరం. పేపరునుంచి తలఎత్తు

తాడు—మగరాయుడి క్రాఫింగ్, ఆకర్షణలేని ఆడమొగం! ఛీ! పేపరులో మళ్ళీ తల. వంచిన తలతోనే భోజనం పూర్తవుతుంది. ఆఫీసుమళ్ళీ! తర్వాతసాయంత్రం!

ఎన్నాళ్ళిట్లా? అర్థమూ, ఆనందమూ లేని యీ సంసారం వకరోజా, రెండు రోజులా! మార్కండేయాయుష్షు గల తనకి యిదేనా జీవితానందం? బుర్రలో గిర్రుమనే ప్రశ్నలు! లక్ష్యం లేకుండా పోయే అడుగులు! తర్వాత...

* * *

సుబ్బారావ్ తెల్లటి దుస్తులతో ముస్తాబయి గబగబా నడుస్తున్నాడు రిక్షాలు, కార్లు అనన్నా ఆగకుండా. అతనికంటె వేగంగా పరుగెత్తే మనస్సును అందుకోవాలన్నప్రయత్నంలాఉందావేగం అతని కళ్ళు మెరుస్తున్నయి ఆనందంతో. సన్నటి యీలతో పరుగెత్తుతున్నాడు చిన్నయింటివైపు ఆసాయంత్రం!

* * *

ఊరి అరుగుల మీద కూర్చున్న ఆడవాళ్ళు అనుకుంటున్నారు సాయంత్రం పరుగెత్తే సుబ్బారావ్‌నుచూచి "చిలకా గోరింకల్లా వుండేవాడు భార్యా భర్తలు. పాపం! భార్య పుట్టింటి కెళ్ళేక సుబ్బారావుకు పిచ్చెక్కినట్లు ఉంటున్నాడు."

